


ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.మంజులవీణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు విజయవంతంగా జరిగాయని వెల్లడించారు. ఒకేషనల్ విభాగంలో 40 సెంటర్లలో, జనరల్ విభాగంలో 37 సెంటర్లలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వృక్షశాస్త్రం పరీక్షకు 1808, జంతుశాస్త్రం పరీక్షకు 1808, భౌతిక శాస్త్రం పరీక్షకు 4217, రసాయన శాస్త్రం పరీక్షకు 4217 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. ఒకేషనల్ విద్యార్థులు మొదటి సంవత్సరం 2881, రెండవ సంవత్సరం 3045 మంది హాజరయ్యారని తెలిపారు.



మొసానిక్ టెంపుల్‌లో విందు ఆరగిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్డదారులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎపిటిఎఫ్, పిఆర్‌టియు బలపర్చిన అభ్యర్థుల ప్రచారం అడ్డదారులు తొక్కుతోంది. డైరీలు, ఇతర కానుకుల పంపిణీతో ప్రలోభాలు ఇప్పటికే మొదలవ్వగా, తాజాగా విందు భోజనాలతో ప్రలోభాలకు గురి చేస్తున్నారు. అటు యుటిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి మద్దతుదారులు మాత్రం ఓటర్లను కలిసి ఆమె ఉద్యమ ప్రస్థానం, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణకు ఇప్పటి వరకు చేసిన పోరాటాలు, కృషిని వివరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, ఎపిటిఎఫ్ మద్దతుదారు పి.రఘువర్మ, పిఆర్‌టియు మద్దతుదారు గాదె శ్రీనివాసుల నాయుడు మధ్యే పోటీ నెలకున్నప్పటికీ విజయగౌరి దారి వేరు, మిగిలిన ఇద్దరు అభ్యర్థులు అనుసరిస్తున్న దారి వేరనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- విద్యా సదస్సు పేరిట కూటమి అభ్యర్థుల విందు భోజనాలు
- డైరీలు, ఇతర కానుకలు ఎర
- ఓటమి భయమే కారణమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జరగనున్న విషయం విధితమే. బరిలో 10మంది ఉన్నప్పటికీ యుటిఎఫ్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, ఎపిటిఎఫ్ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. కానీ, శ్రీనివాసులను నాయుడు వరుసగా రెండు సార్లు గెలిచినప్పటికీ అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి అనుగుణంగా వ్యవహరించారు. దీంతో, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడిచేయలేదు. గత సారి ఎపిటిఎఫ్ మద్దతుదారు రఘువర్మ ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ శాసన మండలిలో ఉపాధ్యాయుల తరపున గొంతు వినిపించలేక పోయారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఉద్యమించిన సందర్భంలో రఘువర్మ ముఖం చాటేశారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో, ఈ ఇద్దరిపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఈనేపథ్యంలో ప్రలోభాలతో మరోసారి ఎన్నికల్లో నెగ్గేందుకు పోటీ పడుతున్నారని ఉపాధ్యాయుల నోట వినిపిస్తున్న మాట. ఇందులో భాగంగానే ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే శ్రీనివాసులు నాయుడు విందు భోజనాలతో శిబిరాలు నడిపిన సంగతి తెలిసందే.

రఘువర్మ మద్దతు దారులు విజయనగరం నడిబొడ్డునగల మెసానిక్ టెంపుల్‌లో నిర్వాహకుల పేరూ ఊరూ లేకుండా మంగళవారం నాడు 'విద్యారంగం- వర్తమాన సవాళ్లు' సదస్సు పేరిట ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విందు భోజనం ఏర్పాటు చేసి వర్మకు మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. మరోవైపు ఉపాధ్యాయుల మద్దతు ఉన్నట్టుగా చెప్పుకునేందుకు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసినవారిని రోజువారీ కూలి ఇచ్చిమరీ ప్రచారం చేసుకుంటున్నారని ఉపాధ్యాయుల్లో చర్చ నడుస్తోంది. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నారు.

విజయగౌరి మద్దతు దారులు ఇందుకు భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను నేరుగా కలవడంతోపాటు యుటిఎఫ్ నేతగా విజయగౌరి ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణకు చేసిన ఉద్యమాలను వివరిస్తున్నారు. దీనికితోడు ఆమె కుటుంబ సభ్యుల ఉద్యమ ప్రస్థానం కూడా గుర్తు చేస్తుండడంతో ఉపాధ్యాయుల్లో సానుకూల స్పందన లభిస్తోంది. దీనికితోడు శాసనమండలిలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం, ప్రస్తుత ఎమెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, గతంలో రెండుసార్లు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి, ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, ప్రైవేటు స్కూళ్ల పరిరక్షణకు విశేషంగా కృషిచేసిన ఎంవిఎస్ శర్మ కూడా విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు.

అవకాశమిస్తే మీ గళమవుతా

మన్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి విస్తృత ప్రచారం



సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులతో కలిసి విక్టరీ చిహ్నం చూపిస్తున్న పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-సీతంపేట

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో బుధవారం నాయుడుమల్లి, సీతంపేట, శంభాం, ముత్యాలు గ్రామాల్లోని పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33ఏళ్లుగా నిజాయితీ, నిబద్ధతతో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం, 12వ పిఆర్‌సి చైర్మన్‌ను నియమించడం, ఆర్థిక బకాయిలు చెల్లింపు, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో జిఒ 114 అమలుకు పని చేస్తానన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి, రెగ్యులర్ చేయడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల గొంతును శాసనమండలిలో వినిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజకుమారి, జిల్లా మహిళా కార్యదర్శి విశాలాక్షి, మహిళా నాయకులు చంద్రకళ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, కార్యదర్శి కె.కృష్ణారావు, కౌన్సిలర్లు బి.జయప్రకాశ్, పి.కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ఆనందరావు, గణేష్, ట్రెజరర్ సింహాచలం, నాయకులు శ్రీనివాసరావు, బి.పకీరు, పద్మశ్రీ, పి.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : పాలకొండ పట్టణంలోని నవోదయ నగర్, శ్రీనివాస్ నగర్, టీచర్స్ కాలనీ, ఎన్‌కె రాజపురం, గాయత్రి నగర్ ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుక అవుతానని, తనను గెలిపించే బాధ్యత మీరందరూ తీసుకోవాలని కోరారు. ఈ ప్రచారంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి మహేష్, యుటిఎఫ్ జిల్లా నాయకులు మజ్జి పైడిరాజు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భామిని : బాలేరు, భామిని, కొత్తూరులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయ, అధ్యాపకులతో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే, కాంట్రాక్టు లెక్చరర్లు, కెజిబివి ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరికి భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశ్‌రావు, జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, భామిని మండల అధ్యక్షులు ఈగల తిరుపతిరావు, జిల్లా కౌన్సిలర్లు పి.కృష్ణారావు, మహిళా నాయకులు టి.రాజకుమారి, విశాలాక్షి, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి గెలుపు ఉపాధ్యాయులకు కీలకం

ఫ్యాప్టో పూర్వ చైర్మన్ బాబురెడ్డి

రాజాం : రాష్ట్రంలో విద్యారంగంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఫ్యాప్టో పూర్వ చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పి.బాబురెడ్డి అన్నారు. విజయగౌరిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఆయన రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని, వారు పోరాడుతున్న తీరును వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. ఈనేపథ్యంలో మన సమస్యలపై శాసనమండలిలో గళం వినిపించేందుకు విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేడు పాలకొండలో జగన్ పర్యటన

ప్రజాశక్తి-పాలకొండ

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం పాలకొండ రానున్నారు. ఇటీవల జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు పరామర్శించడానికి జగన్ వస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పార్టీ నాయకులు దగ్గరుండి ఏర్పాట్లు చేపట్టారు. హెలీప్యాడ్ స్థలాన్ని వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పార్వతీపురం, పాలకొండ మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, కళావతి పరిశీలించారు.

పార్వతీపురంరూరల్ : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలకొండలో గురువారం పర్యటించనున్నారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ వస్తున్నారని, అధినేతకు భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై సంఘీభావం తెలపాలని కోరారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, బలిజిపేట మండల అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, మజ్జి శేఖర్, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాథరావు, బంకురి రవికుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సాలూరు : గత కొంత కాలంగా బొబ్బిలి మున్సిపల్ కార్మికులు మున్సిపాలిటీ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ప్రదేశాల్లో పోలీసులు దాడి చేసి గుడిసెలను తీసేయడం, మహిళలను చూడకుండా లాగేయడాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఖండించారు. ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న మున్సిపల్ కార్మికులకు వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే బేబినాయన వెంటనే మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు అదే ప్రదేశంలో పట్టాలు ఇవ్వాలని కోరారు. మన్యం జిల్లాలోని పాలకొండ, పార్వతీపురం, సాలూరు, విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల, రాజాం. విజయనగరం తదితం చోట్ల కూడా కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల శుభ్రతను చూస్తున్న అట్టడుగు వర్గాల కార్మికులు పారిశుద్ధ్య కార్మికులను అలాంటి వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం సరికాదని తెలిపారు. ఈ సమస్య పరిష్కరించాలని లేకుంటే ఈ ప్రాంతాల్లో కూడా భవిష్యత్తులో పోరాటానికి వెనుకడుగు వేయమని తెలిపారు.

బడ్జెట్‌తో కార్పొరేట్లకు మేలు

- కేంద్ర బడ్జెట్‌ను ప్రజలంతా తిరస్కరించాలి
- వామపక్షాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ఆర్థిక స్థితిగతులను మార్చే రీతిలో లేదని వామపక్ష నాయకులు తెలిపారు. అది కేవలం కార్పొరేట్లకు రాయితీలను అందిస్తూ ప్రోత్సహించే బడ్జెట్‌గా మాత్రమే ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మేలు చేకూర్చని ఈ బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ జాతీయ, రాష్ట్ర వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా బుధవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, సిపిఐ (ఎంఎల్) నాయకులు పి.రమణి మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచేందుకు చర్యలు తీసుకోవడం మానేసి, మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం గర్హనీయమన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే బాగా తగ్గిపోయిందని తెలిపారు. అవసరం ఉన్నప్పటికీ ఉపాధిహామీకి నిధులు అదనంగా కేటాయించలేదని చెప్పారు. ధరల పెరుగుదల, జిఎస్‌టి పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌ఛార్జీలను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని కోరారు. ఉపాధి హామీకి కేటాయింపులను 50శాతం పెంచాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య పెన్షన్లు, ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో మూడు శాతానికి పెంచాలని, విద్యా రంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలని, ఎస్‌సి, ఎస్‌టి రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేశారు. వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలని, స్కీమ్‌వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం బిజెపి షరతులకు లొంగి రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాలరాయొద్దని విజ్ఞప్తిచేశారు. రానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా గిరిజన యూనివర్సిటీకి, పెండింగ్ ప్రాజెక్టులకు, రిజర్వాయర్లకు, నిలిచిపోయిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి, విద్య, వైద్య ఉపాధి రంగాలకు అధికమోతాదులో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణు, సిపిఐ నాయకులు టి.జీవ, సూరయ్య, అయర్ల సంఘం నాయకులు పి.సంఘం, సిపిఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, రైతు సంఘం నాయకులు డి.వి.నాయుడు, ఎఐటియుసి నాయకులు ఆర్.వి.ఎస్ కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాచలం, డేవిడ్, రాజన్న, బిడ్డిక నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



డిఐఇఒ మంజులవీణను అభినందిస్తున్న కలెక్టర్

డిఐఇఒకు అవార్డు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి డి.మంజులవీణకు ఆచార్య దేవోభవ అవార్డు లభించింది. గణిత శాస్త్ర అధ్యాపకులుగా, ఉమ్మడి జిల్లాల ఆర్ఐఒగా, పార్వతీపురం జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారిగా మంజులవీణ అందించిన సేవలకు గాను ప్రియదర్శిని సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 2025 సంవత్సరానికి ఈ అవార్డును అందించింది. 1998 సంవత్సరంలో రాష్ట్ర సర్వీస్ కమిషన్ ద్వారా గణితశాస్త్ర అధ్యాపకులుగా ఎంపికై శ్రీకాకుళం జిల్లా మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వీస్‌లో చేరారు. వివిధ ప్రాంతాల్లో పదేళ్లపాటు గణితశాస్త్ర అధ్యాపకులుగా, 17 ఏళ్లపాటు వివిధ కళాశాలల ప్రిన్సిపల్‌గా, ఉమ్మడి జిల్లాల ఆర్ఐఒగా సేవలను అందించారు. ప్రస్తుతం మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారిగా సేవలను అందిస్తున్నారు. ప్రవేశాలు, విద్యా ప్రమాణాలు, పబ్లిక్ పరీక్షలు నిర్వహణ పరంగా, ఫలితాల సాధనలో జిల్లాను ముందుంచ డంతో అవార్డును అందించారని మంజుల వీణ తెలిపారు. అవార్డు రావడం పట్ల మంజుల వీణను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అభినందించారు.

ప్రయివేటు ఆస్పత్రులు

నిబంధనలు పాటించాల్సిందే

ఆకస్మిక తనిఖీలు చేపట్టిన డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-సాలూరు

ప్రయివేటు ఆస్పత్రులు వైద్యారోగ్యశాఖ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. ఈ మేరకు సాలూరులో ప్రయివేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిలడెల్ఫియా లెప్రసీ హాస్పిటల్, జ్యోతి హాస్పిటల్, స్కానింగ్ సెంటర్లు, మామిడిపల్లిలో లక్ష్మీ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలు ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించి ధ్రువపత్రాలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి ఆసుపత్రిలో తనిఖీలు, పరీక్షలకు వచ్చిన వారి వివరాలు స్పష్టంగా పూర్తి స్థాయిలో నమోదు చేయాలని ఆదేశించారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీల రుసుం వివరాలు ఆసుపత్రిలో ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రిలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పిసిపిఎన్‌డిటి యాక్ట్ నిబంధనలు పాటిస్తున్న తీరు, సంబంధిత పోస్టర్లు అక్కడ ప్రదర్శించినదీ, లేనిదీ పరిశీలించారు. గర్భిణీ స్కానింగ్ వివరాలు ఫార్మ్-ఎఫ్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. శస్త్ర చికిత్సలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా అనస్థీషియా డాక్టర్ అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ విధానంపై పరిశీలించి పరికరాల పనితీరు, వివియోగంపై సిబ్బందికి నైపుణ్యం ఉండాలని సూచించారు. ఆరోగ్య సూచనలు తెలియజేసే పోస్టర్లు ఆసుపత్రిలో ప్రదర్శించాలన్నారు. ఆరోగ్యశాఖ మార్గదర్శకాలు పాటించాలని, ఏవిధమైన లోపాలు గుర్తించినా తగు శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యాలయ డెమో వి.సన్యాసిరావు, వై.యోగీశ్వర రెడ్డి, సిసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు



ఎస్‌కెపాడు నర్సరీని పరిశీలిస్తున్న పిఒ శ్రీవాత్సవ

ఏజెన్సీలో పిఒ పర్యటన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ పర్యటించారు. ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కె పాడు ఉద్యానవన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కు ఏర్పాటు చేశామని, మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. పర్యాటకులకు అన్ని రకాల వసతులు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టికెబాయి ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొటియా వివాదాన్ని పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు



గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-సాలూరురూరల్

దశాబ్దాల కాలంగా ఉన్న కొటియా గ్రామాల వివాదాన్ని ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రభుత్వ నేతలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులతో కలిసి వివాదాస్పద కొటియా సరిహద్దు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక గిరిజనులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య చిన్న సమస్యను పరిష్కరించకుండా ఇటు ఆంధ్ర, అటు ఒడిశా, కేంద్ర ప్రభుత్వాలు కూడా తాత్సారం చేస్తున్నాయని తెలిపారు. ఇది ఏదో దేశాల మధ్య సరిహద్దు వివాదంగా భూతద్దంలో చూసి, పరిష్కారం చేయకపోవడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం నుండి గిరిజన సంక్షేమ శాఖామంత్రిగా ఉన్న గుమ్మిడి సంధ్యారాణి వెంటనే కొటియా వివాదాన్ని పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు.

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు వివాదంపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తూ స్టేటస్‌కో ఉన్నందున ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చునని తెలిపారు. అలా కాకుండా గత పదేళ్ల నుంచి ఒడిశా దూకుడు పెంచి ఈ ప్రాంతాలపై పట్టుసాధించడానికి ప్రయత్నిస్తున్నా ఆంధ్రా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వచ్చే ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను కొటియా పోలీసులు అడ్డగించినా పట్టించుకోకపోవడంపై ప్రభుత్వాన్ని ఆక్షేపించారు. ఇదే కొనసాగితే కొటియా ప్రాంతంపై ఆంధ్రా ఆధిపత్యం పూర్తిగా పోతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉండే గిరిజనులకు రక్షణగా ఉండే చట్టాలను అమలు చేసి, వారి జీవన విధానాలను మెరుగుపరిచే విధంగా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడాలి గాని అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని ఒడిశా పోలీసులకు ఆయన హితవుపలికారు.

అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఆంధ్రా, ఒడిశాతోపాటు కేంద్రంలోనూ ఎన్‌డిఎ ప్రభుత్వాలే ఉన్నాయని, ఈ సమయంలోనే వివాదాన్ని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, అదివాసీ గిరిజన సంఘం నాయకులు తాడంగి సన్నం, సీతయ్య, కొంబులు, చరణ్, మర్రి మహేష్, చోడిపల్లి బిరుసు, సుబ్బా, కూనేటి సుబ్బా తదితరులు పాల్గొన్నారు



శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

శివాజీ గొప్ప దేశభక్తుడు

నివాళులర్పించిన మంత్రి, మాజీ మంత్రి

ప్రజాశక్తి-సాలూరు

ఛత్రపతి శివాజీ గొప్ప దేశభక్తుడని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. శివాజీ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని శివాజీ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి సంధ్యారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె శివాజీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, కొనిసి చిన్ని పాల్గొన్నారు.

శివాజీ సెంటర్‌లో ఆయన విగ్రహానికి మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేసిన నాయకుడని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్ జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయం వద్ద శివాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు

సిఎం దృష్టికి అగ్రిగోల్డ్ సమస్యలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం వద్ద అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం భారీగా డిపాజిట్లు సేకరించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం నిధులను పక్కదారి పట్టించి సొంతంగా ఆస్తులు కొనుగోలు చేసి, బినామీలు పేరిన కొన్ని ఆస్తులు రాయించుకుని, తర్వాత బోర్డు తిప్పేసి కస్టమర్లు, ఏజెంట్లను మోసం చేసిందని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

లాభదాయక పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

రైతులు సంప్రదాయ పంటలను విడిచిపెట్టి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటల వైపు మారాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. బుధవారం మండలంలోని అమ్మవలస గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుకు మంచి ఆదాయాన్ని ఇచ్చే నిమ్మగడ్డి సాగు దిశగా ఆలోచనలు చేయాలని చెప్పారు. ఎలాంటి పంటలు పండని బీడు భూములలో సైతం నిమ్మగడ్డి సాగుతో లాభాలు పొందవచ్చని తెలిపారు. చాలామంది రైతులు పత్తి పంటను వర్షాధారంగా వేయడం వల్ల నాలుగు క్వింటాళ్ల మించి దిగుబడి రావట్లేదని, అంతిమంగా కనీసం 10 వేల రూపాయల ఆదాయం కూడా ఉండట్లేదని తెలిపారు. రైతులు పత్తి స్థానంలో, ఇతర ఏ పంటలూ పండని బీడు భూములలో నిమ్మగడ్డి సాగు చేపట్టవచ్చని సూచించారు. ఎకరానికి ఒక కోతలో 10 కిలోల నూనె వస్తుందని, ఏడాదికి నాలుగైదు కోతలు తీయవచ్చని తెలిపారు. పదేళ్ల వరకు దిగుబడి ఉంటుందని, కిలో నూనె వెయ్యి రూపాయలు పలుకుతుందని వివరించారు. 100 ఎకరాల క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఉచితంగా నూనె తీసే యంత్రాన్ని జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేస్తామని తెలిపారని గుర్తుచేశారు. రాయిగుడ్డి వలస రైతులు ఇప్పటికే ఒక క్లస్టర్ ఏర్పాటు చేశారని చెప్పారు. అమ్మవలస చుట్టుపక్కల రైతులు కూడా ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్‌కృష్ణ, ఎపిసిఎంఎఫ్ఎల్ విజయ్ పాల్గొన్నారు.

శిక్షణకు అనుగుణంగా ఎస్‌డబ్ల్యుపిసి ఉండాలి

ప్రజాశక్తి-సీతానగరం

పెదబోగిలి పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యుపిసిని జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు నిర్వహించేందుకు అనువుగా ఉండాలని డిపిఒ కొండలరావు అన్నారు. బుధవారం పెదబోగిలి ఎస్‌డబ్ల్యుపిసిని ఆయన పరిశీలించారు. త్వరలో ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒ రమేష్, సర్పంచ్ తెరేజమ్మ గరికయ్య, తదితరులు పాల్గొన్నారు.

6 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఆరు సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఈ నెల 18 నుంచి 21వ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ప్రజలంతా ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండోరోజుకు జ్ఞాన జ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగింపేట కెజిబివిలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ రెండో రోజు బుధవారం కొనసాగింది. సమగ్ర శిక్ష కరస్పాండెంట్ తేజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సులువైన పద్ధతిలో గణితాన్ని బోధించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారి హరి ప్రసాద్, ఎంఇఒ జి.సూరిదేముడు అంగన్వాడీ సూపర్వైజర్ పూర్ణిమ, కెఆర్‌పిలు కురుమినాయుడు, గణపతిరావు పాల్గొన్నారు.

నేడు కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఒమేగా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇఒ ఎం.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించనున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

12 మందికి కుక్కకాటు

ప్రజాశక్తి-సాలూరు



కుక్కకాటుకు గురైన చిన్నారులు

పట్టణంలోని గాంధీనగర్‌లో బుధవారం సాయంత్రం 12 మందికి వీధి కుక్కలు కరిచాయి. వీరిలో ఆరుగురు బాధితులు ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. మిగిలిన వారు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందారు. కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటీ పరిధిలో కుక్కల ఏరివేతకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అయినప్పటికీ కుక్కలు స్వైరవిహారం చేయడంతో స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన

టిడిపి నాయకుడిని అరెస్టు చేయాలి

మూడో రోజూ కొనసాగిన ఆందోళనలు



సాలూరులో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-సాలూరు

ప్రజాశక్తి మక్కువ మండల విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడిని అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలుచోట్ల మూడో రోజు బుధవారం కూడా ఆందోళనలు చేపట్టారు. జర్నలిస్టు సంఘాల నాయకులు బాలి విశ్వేశ్వర రావు, రాపాక కూర్మారావు, నల్లి గోవిందరావు, కె.సింహాద్రి ఆధ్వర్యాన సాలూరు నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు బుధవారం సాలూరు పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. విలేకరి రామారావు పై దాడి చేసిన టిడిపి మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేయాలని, అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దాడికి గురైన విలేకరి రామారావు కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు నిర్మాణ పనుల వద్దకు వెళ్లిన విలేకరిపై దాడి చేసి చంపుతానని బెదిరించడం అన్యాయమని అన్నారు. అనంతరం రూరల్ సిఐ రామకృష్ణ, మండల తహశీల్దార్ కార్యాలయంలో డిటి రాజశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బంకురు శ్రీనివాసరావు, కూనిశెట్టి రామ్మోహన్‌రావు, రమణ మూర్తి, వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీకాంత్, రోహిత్, గుప్తా, ప్రశాంత్, వెంకటేష్, నల్లి శ్రీనివాసరావు, చంద్రమౌళి, ఎం.కృష్ణారావు, చౌక్కాపు తనూజ్, అల్లు శ్యామ్, థామస్, జార్జి, ఈశ్వరరావు, ఎ.రమేష్, కిశోర్‌కుమార్, జి.నాగేశ్వరరావు, అశోక్, కిశోర్ కుమార్, ఎ.వెంకటరావు, వై.మణిబాబు, నరేంద్ర, సంతోష్ కుమార్, వి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజాశక్తి మక్కువ మండల విలేకరి రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడికి నిరసనగా గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటి శేఖర్‌కు వినతి ప్రత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సరిపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి బేతా కుమారస్వామి, సభ్యులు పాలక ప్రేమానంద్, మద్ది నాని, పెంటయ్య, నాయుడు, శ్రీనివాసరావు, పండా రవి, కిషోర్ కుమార్, కంచర్ల రామారావు, తూలుగు రవికుమార్, ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బివి రమణ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పత్రిక, మీడియా ప్రతినిధులపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బెలగాంలోని సుందరయ్య భవనంలో వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పత్రికా, మీడియా ప్రతినిధులపై అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే మక్కువ విలేకరిపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. దాడులకు పాల్పడిన వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛకు అనుగుణంగా ప్రతి వ్యక్తీ తమ అభిప్రాయాలను తెలియజేసే హక్కు ఉందని, అలాంటి హక్కును హరించే అధికారం ఎవరికీ లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో దాడులకు పాల్పడే ధోరణి మంచిది కాదని, ఇలాంటి దౌర్జన్యాలకు, నిర్బంధాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకులు రెడ్డి వేణు, వి.ఇందిర, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, టి.జీవ, సిపిఐ (ఎంఎల్) నాయకులు పి.రమణి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు పి.సంఘం, సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, గిరిజన సంఘం నాయకులు రామస్వామి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాచలం, డేవిడ్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, రైతు సంఘం నాయకులు డివి నాయుడు, వ్యవసాయ కార్మిక నాయకులు జి.సూరయ్య, ఎఐటియుసి నాయకులు ఆర్‌విఎస్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు రాజన్న, బిడ్డిక నాగేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి -కురుపాం



హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులకు సూచించారు. బుధవారం కురుపాం ఎంపిడిఒ కార్యాలయంలో వద్ద హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు మండలంలో ప్రస్తుతం పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల పూర్తి వివరాలను గ్రామాల వారీగా సమీక్ష చేశారు. ఇప్పటివరకు 50 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. మిగతా 50 శాతం ఇళ్లు కూడా మార్చి నెలాఖరికి పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి జె.రమేష్, హౌసింగ్ ఎఇ అచ్చియ్యమ్మ, ఎఒ చంద్రశేఖర్, వర్కర్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజేష్, సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

పీసా చట్టంపై ఇస్తున్న శిక్షణను పీసా కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీసా చట్టంపై శిక్షణను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పీసా చట్టం విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జె.రమేష్, ఎఒ చంద్రశేఖర్, వెలుగు ఎపిఎం బి.వెంకట్, రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, విజయకాంత్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎంఎస్ఎంఇ సర్వే వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ సర్వే ఇంకా దాదాపు 56 శాతం పూర్తి కావలసి ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 12,376 యూనిట్లు సర్వేను తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇదే పనిపై ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాలైన పార్వతీపురం, సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో వెంటనే సర్వే పూర్తి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని, అయినప్పటికీ జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంఎస్ఎంఇ సర్వే పూర్తి కావడం వల్ల సంబంధ యూనిట్లకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ఆయా సంస్థలు పొందుటకు వీలుగా వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రవాణా శాఖ సేవలు

డిపిటిఒ దుర్గాప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మధ్యవర్తిత్వం, అదనపు చెల్లింపులు వంటి భారం లేకుండా నేరుగా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా రవాణా శాఖ సేవలను పొందవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లెర్నర్, డ్రైవింగ్ లైసెన్సుల కోసం దరఖాస్తుదారుడు పరీక్షలకు నేరుగా హాజరై తమ లైసెన్సులను పొందవచ్చని స్పష్టంచేశారు. డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణకు (రెన్యువల్) కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ ఆన్‌లైన్ విధానంలో ఏజెంట్లు, సిబ్బంది ప్రమేయం అవసరం లేదని వివరించారు. ఈ విషయం తెలియక చాలా మంది తమ పనులను మధ్యవర్తిత్వం, అదనపు చెల్లింపులు చేస్తూ సేవలు పొందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రవాణా శాఖలో పాత e-pragathi వెబ్‌సైట్‌ను పూర్తిగా తీసివేశారని చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్లకు సంబంధించి వాహన్ పరివాహన్ వెబ్‌సైట్, డ్రైవింగ్ లైసెన్సుల కోసం సారథి (SARATHI) వెబ్‌సైట్ పనిచేస్తున్నట్లు చెప్పారు. వాహన దారులు వాహన రిజిస్ట్రేషన్లకు చెందిన లావాదేవీలు వాహన్ పరివాహన్ వెబ్‌సైట్‌లో, డ్రైవింగ్ లైసెన్స్‌కు సారథి వెబ్‌సైట్‌లో అప్లై చేసి తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, లెర్నర్ లైసెన్సు, డ్రైవింగ్ లైసెన్సులు పొందుతున్నట్లు తెలిపారు.

పాత e-pragathi వెబ్ సైట్ లోని రికార్డులు కొత్త వాహన్ పరివాహన్ వెబ్‌సైట్, సారథి వెబ్‌సైట్‌లోకి డేటా బదిలీ అయినందున జిల్లాల పునర్విభజన వల్ల కొన్ని వాహన/డ్రైవింగ్ లైసెన్స్‌లో వాటి రికార్డులు పాత జిల్లాలో కనిపిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఉన్న ఈ సమస్యను రాష్ట్ర రవాణా శాఖ పరిష్కరిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మోటార్ వాహన చట్టం నిర్దేశించిన ప్రకారం మాత్రమే వాహన టాక్స్‌లు, అపరాధ రుసుం, గ్రీన్ టాక్స్ వాహనదారుల నుంచి ఆన్లైన్ పేమెంట్ ద్వారా స్వీకరిస్తున్నట్లు వివరించారు.

ఎఒబి గిరిజనులకు సిపిఎం అండ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

మండలంలోని పెదమరికి పంచాయతీ పరిధిలో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామమైన రైతుగూడ గిరిజనులకు సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, పి రాము కలిసి మద్దతు తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా నిలుస్తుందని భరోసాఇచ్చారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో సిపిఎం జెండా ఎగురవేసి, కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పి.వరాలు, తదితరులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ రిజిస్ట్రేషన్‌కు సూచనలు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో రైతులు పిఎం కిసాన్ రిజిస్ట్రేషన్‌ను త్వరగా అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద చేయించుకోవాలని ఎఒ శ్రావణ్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన పిఎం కిసాన్‌పై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మండలంలో 6429 రైతులు మంది రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని తెలిపారు. కొత్తగా భూ హక్కులు పొందిన, ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోక పోయిన రైతులు అందరూ వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వన్‌బికి ఆధార్ లింక్ చేయించని రైతులు విఆర్‌ఒని కలిసి అనుసంధానం చేసుకోవాలని కోరారు.

ఎండిఎపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి గ్రామంలో బుధవారం జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి పర్యటించారు. ఎండిఎ కార్యక్రమం అమలుపై పర్యవేక్షించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించి, ఇంటింటా దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. అనంతరం ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా దోమతెరలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, ఎంపిహెచ్‌ఇఒ కర్ణ, హెల్త్ అసిస్టెంట్ పి.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





పాచిపెంటలో వైద్య శిబిరానికి హాజరైన జనం ; పార్వతీపురంరూరల్.. గొడుగులు, స్టీల్‌గ్లాసులు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

పోలీసుల ఆధ్వర్యాన వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశిల గ్రామంలో బుధవారం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సిఐ గోవిందరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ వృద్ధ మిత్ర కోఆర్డినేటర్, హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి... 50 మంది వృద్ధులు, వికలాంగులు, మహిళలకు గొడుగులు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.సంతోష్, వైద్యులు ఐశ్వర్య, కౌశిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : పోలీసుల ఆధ్వర్యంలో జెమ్స్ హాస్పిటల్ సహకారంతో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 250 మందికి వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ, ఎస్ఐ వెంకట సురేష్, వైద్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భామిని

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన లివిరి బైరి కాలనీలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. లివిరి బైరీకాలనీకి చెందిన బైరి తిరుపతి, బైరి రాజేంద్ర (32) కలిసి మంగళవారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా గొల్ల కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇద్దరిని భామిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యమందించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం సీతంపేట వెళ్లాలని సూచించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బైరి రాజేంద్ర, బైరి తిరుపతి తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మంగళవారం రాత్రి బైరి రాజేంద్ర మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బైరి తిరుపతి ప్రస్తుతం వైద్యం పొందుతున్నాడు. రాజేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బత్తిలి ఎస్ఐ తెలిపారు. రాజేంద్రకు భార్య సుధా రాణి, ఇద్దరు పిల్లలు వంశీ, కిశోర్ ఉన్నారు. రాజేంద్ర కుటుంబం వలస వెళ్లి, కూలి పనులు చేసుకునే జీవనం సాగిస్తోంది. స్థానికంగా ఒక పెద్దావిడ మరణిస్తే ఆ దినకార్యం నిమిత్తం సొంతూరికి రాజేంద్ర వచ్చాడని, అదే రోజు సాయంత్రమే ప్రమాదం చోటు చేసుకుని మరణించడంపై స్థానికులు విచారం వ్యక్తంచేశారు.

80 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం సమీపంలో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న పీడిక రాజారావును అరెస్టు చేసి, అతని నుంచి 80లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్ పి.రామచంద్రరావు తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడు మెల్లక రాజేంద్ర పరారయ్యాడని తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సిఐ సింహాద్రి, హెచ్‌సి జి.సుదర్శన్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎల్.జనార్ధనరావు పాల్గొన్నట్లు తెలిపారు.